వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 117 శుక్రవారం | 03 నవంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

## ఇనుగాలకు బుజ్జగింపులు



మెరుగైన అవకాశం కల్పిస్తా మంటూ హామీ

2లో..

# గుదిబండ హామీలు

## ఓటర్లను మభ్య పెడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలు

### బడ్జెట్‌ను మించిపోతున్న సంక్షేమ పథకాల ఖర్చు
### ఉన్న వాటికే దిక్కులేదు..కొత్తవాటికి నిధులెట్లా..?
### ఎన్నికల హామీలపై ఆర్థిక నిపుణుల ఆందోళన
### ఇప్పటికే ఆలస్యమవుతున్న జీతాలు
### కోట్లలో పెండింగ్ బిల్లులు







రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. పోటీపడి ప్రచారాలను కొనసాగిస్తున్నాయి. అందులో భాగంగా రైతులు, మహిళల ఓట్లపైనే ఆశలు పెట్టుకున్న అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు పోటీలు పడి వరాల జల్లులు కురిపిస్తున్నాయి. అమలుకాని హామీలను ఇస్తూ ఓటర్లను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నాయి. ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రానికి గుదిబండగా మారాయి. నిధులు లేక రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. గతంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ నేడు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. కొత్తగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రకటిస్తున్న హామీలు అమలులోకి వస్తే రాష్ట్రం దివాళా తీస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సంక్షేమ పథకాల ఖర్చు రాష్ట్ర బడ్జెట్‌ను మించిపోతుందని, దీంతో అభివృద్ధి కుంటుబడి పోతుందని, నిరుద్యోగులు పెరిగిపోయి ఆకలి రాజ్యంగా మారుతుందంటూ హెచ్చరిస్తున్నారు. అధికారం కోసం ఎవరు ఏమైపోతే మాకేంటి అన్న తరహాలో ప్రకటిస్తున్న హామీల విషయంలో ప్రజలు జాగరూకతతో వ్యవహరించాలంటున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..



2లో

## కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోంది

మాజీ మంత్రి కొండా సురేఖ

## కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు

పరకాల కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి



2లో..



8లో

## ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

తొలిరోజు పలువురి నామినేషన్లు

# గుదిబండ హామీలు





**ఓటర్లను మభ్య పెడుతున్న బీఆర్ ఎస్, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలు**

**బడ్జెట్‌ను మించిపోతున్న సంక్షేమ పథకాల ఖర్చు**

**ఉన్న వాటికే దిక్కులేదు.. కొత్తవాటికి నిధులెట్లా..?**

**ఎన్నికల హామీలపై ఆర్థిక నిపుణుల ఆందోళన**

**ఇప్పటికే ఆలస్యమవుతున్న జీతాలు**

**కోట్లలో పెండింగ్ బిల్లులు**

**పెరిగిపోతున్న నిరుద్యోగులు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** అధికారమే లక్ష్యంగా బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు అలవికాని హామీలు గుప్పిస్తున్నాయి. సంక్షేమం పేరిట రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నాయి. సంక్షేమ పథకాల ఖర్చు బడ్జెట్ ను మించిపోతున్నా డొంట్ కేర్ అంటున్నాయి. అధికారంలోకి వస్తే చాలు ఎవరు ఏమైతే మాకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలకు నిధులు లేక నీరసించిపోతుంటే కొత్త, కొత్త పథకాలు ప్రకటిస్తూ ఓటర్లను మభ్యపెడుతున్నాయి. రైతులు, మహిళలు, వృద్ధుల ఓట్లపైనే ఆశలు పెట్టుకున్న నేతలు వారిని ఏమార్చి ఓట్లు దండుకునేందుకు వరాల జల్లులు కురిపిస్తున్నారు. నిధుల లేమితో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున రావాల్సిన జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నప్పటికీ, వివిధ కార్యాలయాల్లో కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్ లో ఉండి అభివృద్ధి కుంటుపడినప్పటికీ సంక్షేమమే మా నినాదం అంటూ ధనిక రాష్ట్రాన్ని దరిద్రపు రాష్ట్రంగా మార్చారన్న ఆరోపణలున్నాయి.

## పెరుగుతున్న బడ్జెట్ అంచనాలు..

రైతు బంధు పథకానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15,075 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. ప్రస్తుతం ఎకరానికి ఏడాదికి రూ.పది వేలు చొప్పున రైతులకు రైతుబంధు ఇస్తోంది. ఇదే హామీ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించింది. అంటే ప్రస్తుతం ఇస్తున్నట్లుగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుబంధు అమలు చేస్తే సుమారు రూ.22 వేల కోట్లు కావాలి. అదే బీఆర్ఎస్ మాత్రం వచ్చే ఐదేళ్లలో సాయాన్ని రూ.16వేల కోట్లకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇప్పటికిప్పుడు వచ్చే ఏడాది నుంచి మాత్రం రూ.12వేలు చేస్తామని ప్రకటించింది. ఇలా పెంచేందుకు దాదాపు రూ.18వేల కోట్లకు బడ్జెట్ పెంచాల్సి ఉంటుంది. ఈ లెక్కన రైతుబంధు విషయంలో ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చే దాన్ని బట్టి ప్రస్తుతం కేటాయిస్తున్న బడ్జెట్ కంటే అధికంగా రూ.3 నుంచి 7వేల కోట్లు అవసరమవుతాయని స్పష్టంగా తెలుస్తోంది. దీన్ని బట్టి ఈ ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన రాష్ట్ర బడ్జెట్ రూ.2.90 లక్షల కోట్లకు అదనంగా మరో రూ.90వేల కోట్లు అవసరం అవుతాయి. అంత బడ్జెట్ ఎక్కడి నుంచి తీసుకువస్తారనేదానిపై రాజకీయ పార్టీలు స్పష్టతనీయడంలేదు. దీనికి సంబంధించి సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపైనే ఉంది. ఇక, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో భాగంగా ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్ ను రూ.2,016నుంచి రూ.4 వేలకు పెంచుతామని ప్రకటించింది. ఆసరా పింఛన్ల అర్హత వయసును ప్రభుత్వం 57 ఏళ్లకు తగ్గించింది. దీని ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 53,09,474 మంది పింఛనుదారులున్నారు. ప్రస్తుతం దీని కోసం ఏటా పెడుతున్న ఖర్చు రూ.11,628 కోట్లు. కాంగ్రెస్ ప్రకటించినట్లుగా లెక్కలు వేసుకుంటే రూ.21,237కోట్లు కావాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ మాత్రం ఇప్పటికిప్పుడు వచ్చే ఏడాది నుంచి పింఛన్లు రూ.3,016కు పెంచుతామని ప్రకటించింది. తర్వాత నాలుగేళ్లలో సంవత్సరానికి రూ.500 చొప్పున పెంచుతూ రూ.5,016 చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన వచ్చే ఏడాది నుంచి బడ్జెట్‌లో రూ.16,013 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. వికలాంగుల పింఛన్లు మరో రూ.1000 పెంచుతామని కూడా పార్టీలు ప్రకటించాయి. కాబట్టి దానికి అదనపు నిధులు అవసరం. మహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ పార్టీ ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ ధర రూ.500కు తగ్గించడం వంటి హామీలున్నాయి. ఈ హామీలు అమలు చేయాలంటే రూ.5నుంచి 6వేల కోట్లు అవసరం అవుతాయి. వీటన్నిటి దృష్ట్యా, పార్టీలు ప్రకటిస్తున్న హామీలు అమలు చేయాలంటే ఆర్థికంగా పెద్దఎత్తున భారం పడటం ఖాయం.

## భారంగా మారనున్న పథకాలు..

అధికారం కోసం బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలు భావి తరాలకు భారంగా మారనున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటిస్తే బీఆర్ఎస్ తన మేనిఫెస్టోలో ఏకంగా గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తామంటూ హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.955గా ఉంది. రూ.455 సబ్సిడీని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భరిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇలా ఒకరు ఒక పథకం ప్రకటిస్తే.. దాన్ని మరింతగా పెంచి మరొక పార్టీ ప్రకటించడం ఆనవాయితీగా మారింది. నిపుణుల అంచనా ప్రకారం దళితబంధు, బీసీ బంధు వంటి పథకాల ద్వారా లబ్ధిదారులందరికీ ఒకేసారి ఇవ్వాలనుకుంటే రూ.2.50లక్షల కోట్లు కావాలి. ఈ ఏడాది ఆర్థిక లోటు రూ.38,235 కోట్లుగా ఉంది. ఈ పరిస్థితుల్లో నీటి పారుదల ప్రాజెక్టులు, ఇతరత్రా ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూనే కొత్త పథకాలకు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. కేవలం రూ.4,882 కోట్ల రెవెన్యూ మిగులుతో రూ.లక్ష కోట్ల విలువైన పథకాలను ఏ విధంగా అమలు చేస్తారో బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చెప్పాల్సి ఉంటుంది.

## పన్నుల భారం..

సంక్షేమ పథకాల పేరుతో అంతిమంగా అప్పులు చేసి పథకాలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు రాష్ట్ర బడ్జెట్ దాదాపు రూ.3 లక్షల 80 వేల కోట్లకు పెంచాల్సి ఉంటుంది. రైతుబంధు, ఆసరా పింఛన్లు, దళితబంధు, బీసీ బంధు సహా ప్రస్తుతం ప్రకటించిన హామీలను లెక్కగడితే ఈ అంచనా వచ్చింది. మరి ఈ లోటును ప్రభుత్వం ఎలా అధిగమిస్తుంది? ఒకటి అప్పులు చేయాలి..రెండు ప్రజలపై పన్నుల భారం మోపాలి. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా ప్రభుత్వం అప్పులు చేసింది. కాబట్టి ఎవరు అధికారంలోకి వచ్చినా పన్నుల భారం కచ్చితంగా ప్రజలపై ఉంటుందని దీనిని బట్టి అర్థమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సొంత పన్ను ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1.31 లక్షల కోట్ల అంచనాగా ఉంది. ఇది కేవలం అంచనా మాత్రమే. పూర్తిగా వసూలు అవుతుందన్న గ్యారెంటీ లేదు. ఈ నిధులు జీతాలకే సరిపోవు. అలాంటప్పుడు పథకాలకు నిధులు కావాలంటే అప్పులు, పన్నులు, రుణాలపై ఆధారపడాలి. ఇది ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

## పెరుగుతున్న నిరుద్యోగం..

ప్రభుత్వాలు ఒకచేత్తో పెడుతూ.. మరో చేత్తో లాక్కొంటున్నట్లుగా ఉంది. బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఇప్పుడున్న బడ్జెట్‌ను రెండింతలు చేయాల్సి ఉంటుంది. మరి దీనికి తగ్గట్టుగా ఆదాయం రెండింతలు చేయగలరా? అన్న ప్రశ్న వేదిస్తోంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య కూడా దినదినాభివృద్ధి చెందుతోంది. ఉద్యోగాలు లేక ఎంతో మంది తమ తనవులను చాలిస్తున్నారు. నిరుద్యోగ సమస్యను ప్రభుత్వాలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో తెలంగాణ ఆకలి రాష్ట్రంగా మారినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.

## అధికార కాంక్షతో హామీలు..

అధికారంలోకి రావాలనే కాంక్షతో బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు హామీలు ఇస్తున్నారే తప్ప ఆదాయం ఎలా వస్తుందనేది ఆలోచన చేయడం లేదని ఆర్థిక నిపుణుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎఫ్ఆర్బీఎం పరిమితులు దాటి అప్పులు చేశారంటున్నారు. కొత్త పథకాలు ప్రవేశపెడితే మరిన్ని అప్పులు చేయాల్సి ఉంటుందంటున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు ఒకరు ఒక పథకం ప్రకటిస్తే.. మరొకరు దానికి మరింత హంగులు అద్ది ప్రకటించడం మరింత భారంగా మారనుందంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక పురోగతిపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఆలోచించి హామీలు గుప్పిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఇనుగాలకు బుజ్జగింపులు

## మెరుగైన అవకాశం కల్పిస్తామంటూ హామీ

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల టికెట్ రాలేదన్న బాధతో రగిలిపోతున్న ఇనుగాల వెంకట్రామి రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బుజ్జగించింది. పార్టీ పటిష్ఠతకు నిరంతరం కృషి చేసిన ఆయనకు ఈ సారి టికెట్ లభించలేదు. ఆపద్బాంధవుడు లాంటి ఇనుగాలకు అన్యాయం జరిగిందంటూ ప్రజలు ఏకరువు పెట్టడంతో అధిష్టానం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ ఇంచార్జి మాణిక్ రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, ఏఐసీసీ పరిశీలకులు దీపాదాస్ మున్షి, బోసు రాజు తదితరులు ఆయనను పిలిపించుకొని మాట్లాడారు. త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానున్నందున అధిష్టానం ఖరారు చేసిన రేవూరి ప్రకాశ్ రెడ్డి విజయానికి సహకరించాలని వారు కోరారు. భవిష్యత్తులో మీ స్థాయికి తగిన పదవి ఇస్తామని వారు హామీ ఇచ్చారు. పరకాల నియోజకవర్గంలో ఇనుగాల వెంకట్రాంరెడ్డికి గట్టి పట్టు ఉంది. గత పదేళ్లలో ఆయన పార్టీని రక్షిస్తూ అందరి వాడుగా గుర్తింపు పొందారు. టికెట్ రాకపోవడాంతో ఇనుగాలపై సానుభూతి మరింత పెరిగింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోంది

**మాజీ మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** త్వరలో రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తూర్పులో గెలిచేది తనేనని మాజీ మంత్రి కొండా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. శుక్రవారం శివనగర్ లోని 34, 35 డివిజన్లనుంచి 2000 మంది బీఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివనగర్ లో నిర్వహించిన బహిరంగ సభలో కొండా సురేఖ మాట్లాడుతూ వరంగల్ తూర్పులో అభివృద్ధి ఎక్కడ జరిగిందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మేము చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే ప్రభాకర్, కొత్తపల్లి శ్రీనివాస్, గజ్జెల లింగమూర్తి, డాక్టర్ వెంకన్న, పట్టూరి సుధాకర్, గణిపాక అంజమ్మ, రాజమణి, సుజాత, తొగరు రాధిక, లావణ్య, లక్ష్మి, శామంతుల కిరణ్, వినోద్, కృష్ణ, విజయ్, శ్రీధర్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు

## పరకాల కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్, కందిబండ, నీరుకుల్లా, పెంచికలపేట, కామారం, పెద్దాపూర్ గ్రామాలలో ఆయన ప్రచార యాత్రను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, మహిళలు పూలమాలతో బానసంచెలు పేల్చి ప్రకాష్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నేర్పుల గ్రామ రైతులు పండించిన పంటకు వడ్లను ఆరబెట్టుకోవడానికి కల్లాలు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వారికి రానున్న ప్రభుత్వంలో 10 ఎకరాల భూమి కేటాయించి రైతులకు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాయమాటలతో కేసీఆర్ అధికారంలోకి వస్తే ప్రజలు అనేక ఇబ్బందులు పడతారన్నారు. అధికారంలోకి రాకముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ మరిచి పోయి కుటుంబ పాలన కొనసాగిస్తున్న కేసీఆర్ కు ఈసారి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పలు గ్రామాల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి వందలాది మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇనుగాల వెంకటరామిరెడ్డి, నాయకులు దొమ్మడి సాంబయ్య, జడ్పీటీసీ రాధిక రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, ఆత్మకూర్ పీఏసీఎస్ చైర్మన్ ఏర్కొండ రవీందర్ గౌడ్, ఎంపీపీ రజనీకర్ గౌడ్, మండల నాయకులు పరికరాల వాసు, ఆత్మకూర్ మాజీ సర్పంచ్ నాగేల్లి సామెల్, పెంచికల్ పేట గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్‌కు 80సీట్లు పక్కా

### ఏఐసీసీ స్పోక్ పర్సన్ డాలి శర్మ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ స్పోక్ పర్సన్ డాలి శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కల్వకుంట్ల ఫ్యామిలీ కాదు కాదు స్కామిలి అని ఎద్దేవా చేశారు. ఫ్యామిలీ మొత్తం ఏటీఎంల వాడుకున్నారని, నిరుద్యోగులను దళితులను బీసీలను గిరిజనులను అన్ని రకాల సామాజిక వర్గాలను మోసం చేశారని, పేపర్ లీక్ లతో వరంగల్ జిల్లాకు చెందిన ప్రవళిక అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆమె ఆత్మహత్యను కూడా తప్పుదోవ పట్టిస్తూ అవమానించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, జీవితం ముఖ్యమని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని, ఇద్దరు కలిసి కాంగ్రెసును ఓడించాలని అనుకుంటున్నారని, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి మందు డబ్బులు పంచాలని చూస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల కోసం బడుగు బలహీన వర్గాల కోసం ఆదివాసుల కోసం దళితుల కోసం పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణలో కచ్చితంగా 80సీట్లకు పైగా సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొలుగూరి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన గన్నోజు



**వరంగల్ వాయిస్, పరకాల :** దళితులను అవమాన పరిచిన చల్లా ధర్మరెడ్డికి దళిత జాతి బుద్ధి చెప్పాలన్నారు. హైదరాబాద్ జానారెడ్డి స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్ ఠాక్రే సమక్షంలో గన్నోజు శ్రీనివాస చారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికకు పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి, ఏఐసీసీ అబ్జర్వర్ డా.శ్రావన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య నాయకత్వం వహించారు. మరో టీడీపీ కీలక నేత తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే గన్నోజు శ్రీనివాస చారి ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి ఈ రోజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, లక్ష్మీపురం ఎంపీటీసీ పల్లెబోయిన సునీత -శ్రీనివాస్, నార్లాపూర్ మాజీ సర్పంచ్ పెద్ద బోయిన రవీందర్ యాదవ్, మాజీ ఎంపీపీ నేతాని ఆదిరెడ్డి, వెల్లంపల్లి మాజీ సర్పంచ్ తిక్క సంజీవ్ పాల్గొన్నారు.

## గడప గడపకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు గడప గడపకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని మహాదేవ పూర్ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

# మీ ఆశీర్వాదాలే.. నాకు శ్రీరామ రక్ష

### ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** మీ ఆశీర్వాదాలే నాకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం గీసుకొండ మండలం నందనాయక్ తండా, దస్రుతండా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాకు ఇత పెద్దఎత్తున స్వాగతం పలికిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గీసుగొండ మండల రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, తనకు దక్కిందన్నారు. 10ఏండ్ల క్రితం గీసుగొండ ఎలా ఉండే.. ఇప్పుడు ఇలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. గతంలో ఎవరూ చేయని అభివృద్ధిని గడిచిన ఈ పదేళ్లలో చేసి చూపించానన్నారు. కాంగ్రెస్ గోబెల్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి మీరంతా దీవించి గెలిపిస్తే మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

### బీఆర్ఎస్‌లోచేరికల పర్వం..

గీసుకొండ మండలం సూర్యతండా గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ పలువురు బీఆర్ఎస్ లో చేరారు. వారికి చల్లా ధర్మారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆంగోతు రాజు, తిరుపతి, రాహుల్, ఆలు, వాంకుడోతు నరసింహా, అజ్మీరా భిక్షపతి, అజ్మీరా బతుకమ్మ, కోఆప్షన్ మెంబర్, కొర్ర రాజు, శంకర్, నర్సింహులతో పాటు తదితరులు చేరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తుందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు విమర్శించారు. సుబేదారిలో బీసీ నాయకుడు చిన్నాల యశ్వంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ శేషు మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ ఎన్నికలలో పోటీ చేయడానికి బీసీలకి అన్ని పార్టీల కంటే అతి తక్కువ స్థానాలను కేటాయించడమే కాకుండా బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ విధమైన ప్రయత్నాలు కూడా చేయడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ రెండు శాతం ఓట్లు లేని బీజేపీ బీసీ ముఖ్య మంత్రిని ఎలా చేస్తుందని విమర్శిస్తున్నారంటే కాంగ్రెస్ కు బీసీ ముఖ్యమంత్రి కావటం ఇష్టం లేదనుకోవాలా, మరి కాంగ్రెస్ పార్టీనే బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించకుండా ఎందుకు విమర్శలు చేస్తుందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్, అధికారంలోకి వస్తామని కలలుకంటున్న కాంగ్రెస్ బీసీల అభివృద్ధి సంక్షేమం రాజ్యాధికారం పట్ల తమ వైఖరి ప్రకటించకుండా ఎందుకు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు టికెట్లు కేటాయించకుండా డిక్లరేషన్ ప్రకటించకుండా బీసీలను మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దారబోయిన సతీష్, రమేష్, నరేందర్, జితేందర్ పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు అండగా ఉండే పార్టీకే మద్దతు

### సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కురవి :** ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను క్రమబద్ధీకరించి, కాలనీ అభివృద్ధికి అండగా ఉండే పార్టీకి ఎన్నికలలో సీపీఐ మద్దతు ఉంటుందని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. కురవి మండల కేంద్ర శివారులోని సీపీఐ భూ పోరాట వాసులతో నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు , రేషన్ కార్డులు, 57 ఏళ్లకే పెన్షన్ ,ఇంటికో ఉద్యోగం లాంటి వాగ్దానాలను అటకెక్కించి ఎన్నికల వాగ్దానాలను మరిచి, అభివృద్ధి పేరిట దళితుల భూములను బలవంతంగా గుంజుకున్న కేసీఆర్ ప్రభుత్వానికి ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. యువతకు ఉపాధి, పేదలకు సంక్షేమం, కార్మికుల హక్కులను కాపాడుతూ, పారదర్శక పాలన అందిస్తూ పేదలు వేసుకున్న గుడిసెలను క్రమబద్ధీకరించి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరి చేస్తానన్న పార్టీలకే ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్ గౌడ్, కన్నే వెంకన్న, దైద నితిన్, కురాకుల వీరన్న, గుట్టయ్య, కొప్పుల హేమలత, నక్క ఉమా, అచ్చమ్మ, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వినయన్న వెంటే పశ్చిమ ప్రజలు

### కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు నచ్చే ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని, పశ్చిమ ప్రజలు వినయన్న వెంటే అని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆదె బస్వరాజుకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. తెలంగాణ కోసం, బంగారు తెలంగాణ కోసం పాటుపడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. పశ్చిమ నియోజకర్గ అభివృద్ధి ప్రదాత దాస్యం వినయ్ భాస్కర్ అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి 5వేల కోట్లు నిధులు తీసుకొచ్చిన ఘనత వినయ్ భాస్కర్ కే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో వినయన్న నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్, 31వ డివిజన్ ఇంచార్జి జోరిక రమేష్, యూత్ అధ్యక్షులు ఆదె ఉమేష్, కామగోని వెంకటేశ్వర్లు, పద్మచారి, సోషల్ మీడియా ఆర్గనైజర్ సృజన్, రాచమళ్ల మధు, కలకొట్ల ఉమేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ఆరాటం

## పరకాల అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని తప్పక అమలు చేస్తుందని, పోడు భూములు రైతులకు పట్టాలిస్తుందని పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదం కోసం శుక్రవారం ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్, హౌజ్ బుజర్గ్ గ్రామంలో ఇంటింటికి ప్రజా దీవెన యాత్ర సాగింది. మొదటగా గీసుగొండ మండలం కొమ్మల గ్రామం శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కటాక్షపూర్ గ్రామానికి భారీ కాన్వాయితో చేరుకున్న రేవూరి ప్రకాష్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి కటాక్షపూర్ సెంటర్ నుంచి హౌజ్ బుజూర్గు వరకు ప్రచారం చేశారు. ప్రచారం మధ్యలో గ్రామస్తులకు రేవూరి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో కూడిన కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన అన్ని హామీలను అమలు పరుస్తుందన్నారు.బీఆర్ఎస్ పార్టీకి ఆరు గ్యారంటీల భయం పట్టుకుందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పోడు భూముల రైతులకు ఒరిగిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పోడు భూముల రైతులకు పట్టాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పోడు భూములు దున్నుకునే రైతులకు పట్టాలు ఇస్తామని అన్నారు. పరకాల బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే డబ్బులు గెలిచినట్టు, నేను గెలిస్తే పరకాల నియోజకవర్గ ప్రజలు గెలిచినట్లని రేవూరి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, ఆత్మకూరు ఎంపీపీ మార్క సుమలత -రజినీకార్ గౌడ్, జడ్పీటీసీ తాకేర్ల రాధికా-రాజు, ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాపూర్ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఎరుగొండ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యవర్గం, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జేవీవీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్లికా మెన్షన్ లో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆచార్య కాశీనాథ్ అధ్యక్షతన నిర్వహించారు . ఆద్యంతం విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథంతో జరిగిన ఈ సమ్మేళనానికి పరికిపండ్ల వేణు, ధర్మ ప్రకాష్ లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం చేసేందుకు జేవీవీని విస్తృత ప్రజా ప్రజాబాహుళ్యంలోకి తీసుక వెళ్లడానికి తగు కార్యాచరణ గురించి వక్తలు, సీనియర్ కార్యకర్తలు ఆచరణాత్మకమైన సూచనలు చేశారు. విశ్రాంత అటవీ అధికారి పురుషోత్తం, ఆచార్యులు ఆంజనేయులు, రవికుమార్, హరిప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకరచారి, అధ్యాపకులు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా విచ్చేసిన అల్వాల నాగేశ్వరరావు, వెలిదండి సుమలత, సీనియర్ న్యాయవాది రమేష్ బాబు మెరుగైన సమాజం కోసం జన విజ్ఞాన వేదిక ప్రధాన రంగాలైన విద్యా, ఆరోగ్యం, శాస్త్ర ప్రచారం, మహిళాభ్యుదయం గురించి నిర్దిష్టంగా కార్యక్రమాలు రూపొందించుకుంటూ ముందుకెళ్లాలని తమ ప్రసంగాలలో సూచించారు. విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ రామచంద్రయ్యలు భవిష్య దర్శనం గూర్చిన దిశా నిర్దేశం చేశారు. హనుమకొండ జిల్లాలోని అన్ని మండలాల కార్యకర్తలతో పాటు ములుగు, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు. వేదిక సభ్యత్వాన్ని డిసెంబర్ 31లోపు పూర్తిచేసి అన్ని మండలాలలో మహాసభలు నిర్వహించి మండల కమిటీలు వేయాలని, జిల్లా మహాసభ జనవరి 31లోపు నిర్వహించాలని, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముఖి సైన్సు ప్రతిభాపాటవ పోటీలను పాఠశాల స్థాయి డిసెంబర్ 13న, మండల స్థాయి డిసెంబర్ 20, జిల్లా స్థాయి డిసెంబర్ 28న నిర్వహించాలని, సృజనాత్మక అంశాలతో ప్రజల్లోకి విస్తృతంగా “శాస్త్రీయ దృక్పథాన్ని” తీసుకెళ్లేందుకు నవంబర్ 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు నాలుగు నెలల పాటు కార్యాచరణ చేయాలని అలాగే ఎన్నికలలో పాల్గొంటున్న వివిధ పార్టీల అభ్యర్థులు, ప్రముఖులతో మెరుగైన సమాజం కోసం ప్రజల ప్రగతి కోసం చేయాల్సిన ప్రణాళికపై చర్చలు, రౌండ్ టేబుల్ సమావేశాల నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సునీత, సరళ సుమతి, మంజుల పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక బృందం సభ్యులు ఎర్రన్న, మొగిలి ఆలపించిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

## డివిజన్ బాధ్యుల సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో 12, 13, 20, 22, 23, 25 డివిజన్ల 100ఓట్ల బాధ్యులతో ఆకుతోట కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 22వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మావురపు గీత విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ నుంచి డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శివ, బూత్ కన్వీనర్లు బూతు ఇంచార్జిలు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు

### ఎక్సైజ్ ఈఎస్ చంద్రశేఖర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయుటకు ఎక్సైజ్ శాఖ చాలా జాగ్రతతో పని చేస్తుందని ఎక్సైజ్ ఈఎస్ చంద్రశేఖర్ అన్నారు. ప్రజలను మరింత అప్రమత్తంగా చేసేందుకు, కల్తీమద్యం, అక్రమ మద్యం సరఫరా, నిల్వల గురించి ప్రజల నుంచి ఫిర్యాదులు, సమాచారం కోసం ఎక్సైజ్ శాఖ రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2523 కు, హనుమకొండ జిల్లా పరిధిలో హనుమకొండ కంట్రోల్ రూం నెంబర్ 0870-2577502కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ ఈఎస్ చంద్రశేఖర్ గారు తెలిపారు. వినియోగదారులు వైన్ షాప్ ల నుంచి కొనుగోలు చేసిన మద్యం సరైనదేనా కాదా తెలుసుకొనుటకు విరీట్ (VERIT)మొబైల్ ఆప్ ద్వారా స్కాన్ చేసి తెలుసుకోవచ్చని అన్నారు. ఈ ఆప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై గల హెూలోగ్రాంను స్కాన్ చేస్తే బాటిల్ బ్రాండ్, పరిమాణం, ధర, బ్యాచ్ నెంబర్, తయారీ తేదీ, బాటిల్ జారీ చేయబడిన డిపో, వైన్ షాప్ పేరు డిస్ ప్లే అవుతుందన్నారు. ఒకవేళ మద్యం నకిలీ, అక్రమ మద్యం అయితే ఈ వివరాలేవీ కనిపించవని ఈ విరీట్ (VERIT) మొబైల్ ఆప్ ను అందరూ గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఉచితంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చని అన్నారు. ప్రజలందరికీ ఈ విషయాలను తెలియజేసి ఏవైనా ఫిర్యాదులు,అక్రమ మద్యం సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2523కు, హనుమకొండ జిల్లా ఎక్సైజ్ కంట్రోల్ రూం నెంబర్ 0870-2577502కు సమాచారం ఇచ్చి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

## విశ్వబ్రాహ్మణ మహాజన సభను జయప్రదం చేయండి

### డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 5న జరిగే విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సభను విజయవంతం చేయాలని కేయూ విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం సలహాదారుడు, హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ కోరారు. విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(వోపా)ఉపాధ్యక్షుడు డాక్టర్ మారేడుగొండ బ్రహ్మయ్యతో కలిసి శుక్రవారం విశ్వవిద్యాలయంలో మహాజన సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి బోధన, బోధనేతర సిబ్బందికి అందించి మాట్లాడారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద ఎత్తున సభకు హాజరు కావాలని, అదేవిధంగా ఉద్యోగులతో పాటు మీ మీ ప్రాంతాలలో ఉన్న విశ్వబ్రాహ్మణ జాతీయులను హాజరు పరిచే విధంగా కృషి చేసి సభను విజయవంతం చేయాలని ఉద్యోగులను కోరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సుద్దాల విద్యాసాగర్, శ్రీరామోజు కృష్ణమూర్తి, బెజ్జంకి శ్రీనివాస చారి, పూసాల రామకృష్ణ, శ్రీరామోజు రమేష్ చారి, విశ్వబ్రాహ్మణ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం




**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగో బెటాలియన్ ఆవరణంలో అపోలో స్పెక్ట్రా హాస్పిటల్స్ అమీర్ పేట్ వారి సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాలుగు, ఐదు బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం నిపుణులైన వైద్య బృందాన్ని పిలిపించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు . పోలీస్ సిబ్బంది ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెటిక్, డెంటల్ (హ్యాపీ డెంటల్ హాస్పిటల్) విభాగాలలో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, సోమనీ, డాక్టర్లు కిరణ్ కుమార్ రెడ్డి, రాజశేఖర్, ప్రియాంక, వెంకట్, అధికారులు, వైద్య సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

## జోరందుకున్న బీఆర్ఎస్ ప్రచారం




**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని బంజారా గ్రామంలో గడపగడపకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలులోకి వచ్చాక చేపట్టిన అనేక సంక్షేమాలను గురించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఉన్న ఆర్థిక పరిస్థితుల గురించి, పేద మధ్య తరగతి కుటుంబం కుల ఆర్థిక పరిస్థితి గురించి ఒక్కసారి ఆలోచించుకోవాలని ప్రచారంలో గ్రామ ప్రజలను ఎమ్మెల్యే శంకర్ నాయక్ కోరారు. బీఆర్ఎస్ పాలనలో చెరువులు, కుంటలు మత్తడులు దూకుతున్నాయని, అదేవిధంగా రైతులకు రెండు కాలాలకు సంబంధించిన పంటలు సమృద్ధిగా పండుతున్నాయని, రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వితంతు, వృద్ధాప్య, వికలాంగుల, పెన్షన్లు, ఇలా అనేక రకాలైన పథకాలన్నీ, మన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలోనే సాధించుకున్నామని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని సూచించారు. అంతేకాదు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈసారి మేనిఫెస్టోలోలో ప్రకటించిన హామీలను అమలు పరుస్తామని వాగ్దానం చేశారు.

## దొంతి మాధవరెడ్డి గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొంతి మాధవ రెడ్డి గెలుపు ఖాయమని మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాపురం సర్పంచ్ తప్పేట రమేష్ అన్నారు. మండలంలోని కోనాపురం గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇంటి ఇంటికి తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారు. రానున్న ఎలక్షన్ల్ లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలకు న్యాయం జరుగలేదని, కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దోచుకొని దాచుకున్నారన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి వంటి పథకాలతో ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. ప్రజలందరూ చేయి గుర్తుకు ఓటు వేసి దొంతి మాధవరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి ఎడ్ల నారాయణ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కల్లెపు రాజశేఖర్ గౌడ్, ఉపసర్పంచ్ మండల నర్సింహారాములు, మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు, ఉప్పరపెల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వట్టే తిరుపతి రెడ్డి, లింగాపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మచ్చిక కుమారస్వామి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ రాజబోయిన దూడయ్య, గొట్టూకాల సంపత్, పెరుమాండ్ల మల్లారెడ్డి, వార్డు మెంబెర్స్, నందికొండ శోభాదేవేందర్ రెడ్డి, పురం మంజుల మల్లయ్య, కల్లెపు శ్రీదేవి హరికృష్ణ, ఉప్పునూతుల మానస లింగమూర్తి, కీసరి రమేష్, పైండ్ల యాకయ్య, బ్రాహ్మయ్య, వెల్ది రఘు, దొంతి మధుకర్ రెడ్డి, యూత్ నాయకులు మైదం రాకేష్, అన్నబోయిన రాకేష్, గొట్టూకాల వెంకటేష్, కర్రే రమేష్, అనుముల రాజ్ కుమార్, బుర్రి అశోక్, తాటికొండ జనార్దన్, గానపాక రాంబాబు, మురహరి పవన్, తప్పేట అఖిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ మాజీ యూత్ అధ్యక్షుడు వర్జంతి రాజు , బాపునగర్ చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ జక్కా అశోక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధికి మారుపేరు పెద్ది సుదర్శన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫ్లోరం అధ్యక్షుడు కుండే మల్లయ్య, మాజీ జడ్పీటీసీ జ్యాతుల రాంరెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీ, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు జున్నుతుల మహేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కందకట్ల సాంబయ్య, మార్కెట్ డైరెక్టర్ మాదాసి కుమారస్వామి, శంకరం తండా యువ భూక్య శ్రీనివాస్, మండల యూత్ మూడు రమేష్, వార్డు మెంబర్లు జున్నుతుల శ్రీధర్ రెడ్డి, సురేందర్, పింగిలి లక్ష్మారెడ్డి, ములుక సాంబయ్య, అడుప అశోక్, ఎడ్ల రాజిరెడ్డి, సుంకరి సన్నీ, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గెలిపిస్తే అభివృద్ధి చేస్తా



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలో శుక్రవారం మల్లారం, రసూల్ పల్లి, కొత్తకొండ, ధర్మారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భారీ ఎత్తున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే కొత్త కొండ మండలాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తకొండను మోడల్ మండలంగా చేసి చూపిస్తామన్నారు. వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏటా నేను వీరభద్రున్ని దర్శించుకుంటా, ఎంపీగా నన్ను గెలిపిస్తే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడాను. నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యే గా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సంకకు రాడని ఎత్తుకుంటే దిగడు అంద చందంగా వ్యవహరిస్తాడని ఎద్దేవా చేశారు. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉందన్నారు. కొత్తకొండలో జరిగిన పొన్నం ప్రభాకర్ విజయ భేరి యాత్రలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ దేవస్థాన చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చంద్ర శేఖర్ గుప్తా, కంకనాల సమ్మయ్య, దూడల సంపత్, సిద్దమల్ల కృష్ణ, మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, ఉస కోయిల ప్రకాష్, ఎస్. సమ్మయ్య, ప్రొ.వీరన్న నాయక్, డా.ఎదులాపురం తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# మరోసారి అవకాశం కల్పించండి

## బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకట రమణా రెడ్డి




**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు గడ్డిగానిపల్లి, సెగ్గంపల్లిలో ఇంటింటికి ప్రచారంలో భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకట రమణా రెడ్డి, ఎన్నికల ఇంచార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మరోసారి అవకాశం కల్పించాలని ఓటు అభ్యర్దించారు. ఈ సందర్భంగా సెగ్గంపల్లి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ సెగ్గంపల్లి ప్రజలు ఆలోచించాలి. ఒక్క ఓటు వేస్తే భూపాలపల్లి పట్టణం ఎంత అభివృద్ధి జరిగిందో గమనించాలన్నిరు. నాడు భూపాలపల్లి నేడు భూపాలపల్లి ఎలా ఉందో చూడండని, మీరు అడగకున్న సెంటర్ లైటింగ్ తో డబల్ రోడ్డు వేసుకున్నామని తెలిపారు. చిన్న గ్రామం నుంచి జిల్లా కేంద్రం వరకు ఎదిగిన భూపాలపల్లి మనదని, జిల్లాతో పాటు అన్ని జిల్లా స్థాయి కార్యాలయాలను ప్రభుత్వాన్ని ఒప్పించి మెప్పించి తీసుకుని వచ్చానని పేర్కొన్నారు. సోమరితనంతో ఏ రోజు ఉండలేదని, మీరిచ్చిన అవకాశం దుర్వినియోగం చేయలేదని స్పష్టం చేశారు. భూపాలపల్లికి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి మీ ముందుకు వచ్చానని, మరొక్క అవకాశం ఇవ్వండి భూపాలపల్లి పట్టణానికి సమగ్ర ప్లానింగ్ మాస్టర్ ప్లాన్ తీసుకుని వస్తానని హామీ ఇచ్చారు. మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాల తీసుకుని వస్తానని, పట్టణ మహిళల స్కిల్ డెవలప్మెంట్ భవనం ఏర్పాటు చేసి వారికి ఉపాధి అవకాశం కల్పిస్తానని తెలిపారు. ఫార్మా, ఐటి రంగాలను భూపాలపల్లికి తీసుకుని వస్తానన్నారు. భూపాలపల్లి జిల్లాను రానున్న రోజుల్లో పారిశ్రామిక రంగంలో ముందు ఉంచుతామని చెప్పారు. రూ.105 కోట్లతో వర్షపు నీరు ఆగకుండా ఒక మాస్టర్ ప్లాన్ తీసుకుని వస్తా, సెగ్గంపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్ గా మారుస్తామని ప్రకటించారు.

# అరూరి రమేష్‌కు జన నీరాజనం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధిలోని కొత్తపేట, ఆరెపల్లి, పైడిపల్లిలలో వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ ఇంటిఇంటి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊరూరా మంగళ హారతులతో, కోలాటాలతో, బతుకమ్మలతో అరూరి రమేష్ కి పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు, యువకులు, మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ కు ఓటు వేసి బంగారు తెలంగాణ సమగ్ర అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో చేసిన అభివృద్ధిని వివరించి, జరగబోయే మరికొన్ని అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేశారు. ఇప్పుడు ఓట్ల కోసం కొంత మంది మోసగాళ్లు మీ గ్రామాల్లో, మీ పల్లెల్లోకి వస్తున్నారని వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. ఓట్లు దండుకోవాలని చూస్తే వారికి ప్రజలే ఓట్ల రూపంలో తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విమోచన చైర్మన్ నాగుర్ల వెంకన్న ,జిల్లా రైతు బందు అధ్యక్షురాలు ఎల్లావుల లలితా యాదవ్, స్థానిక కార్పొరేటర్ జన్ను షీబా రాణి -అనిల్, డివిజన్ అధ్యక్షుడు రాజు, ప్యాక్స్ చైర్మన్ హరి కృష్ణ, మండల రైతు బంధు కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా నాయకులు వెంకన్న, మాజీ కార్పొరేటర్ భిక్షపతి, గ్రామ శాఖ అధ్యక్షులు రాజు, రవీందర్, రవీందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 11, 29వ డివిజన్ల లో బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ప్రభుత్వ చిఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఇంటింటికి పంచుతూ ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చారిత్రాత్మక నగరం హనుమకొండలో సబ్బండ వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పనులు కూడా చేపట్టామని అన్నారు. ఐదువేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేశానని, ఆపద కాలంలో ప్రజలకు అండగా ఉంటూ వాళ్ల కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తయారుచేసిన మేనిఫెస్టో (కేసీఆర్ భరోసా)ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. గతంలో కూడా మేనిఫెస్టోలో ఉన్నటువంటి పథకాలే కాకుండా మేనిఫెస్టోలో లేనటువంటి పథకాలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి బృహత్తర పథకాలను ప్రవేశపెట్టి వాటిని సంపూర్ణంగా అందించినటువంటి ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. అనేక పథకాలను ప్రవేశపెట్టి దేశానికే తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్ గా నిలిచిందని అన్నారు. దేశ ప్రజలు కూడా కేసీఆర్ నే కోరుకుంటున్నారని, అన్ని రంగాలలో కేసీఆర్ ను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే ఈ హనుమకొండ నగరం ఎడ్యుకేషనల్ హబ్ గా, ఐటీ హబ్ గా, కల్చరల్ హబ్ గా, టూరిజం హబ్ గా మారిందన్నారు. ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిపక్షాలు పసలేని విమర్శలు చేస్తూ, పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 29వ డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి డివిజన్ లో మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో 150, 11వ డివిజన్ నుంచి 100, మొత్తం 250 మంది బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్య వినయ్ భాస్కర్ నాయకత్వంలో పనిచేస్తామని బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, డివిజన్ ఇంచార్జ్ నార్లగిరి రమేష్, 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, 29వ డివిజన్ అధ్యక్షుడు సదాంత్, ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రసాద్, 11వ డివిజన్ నాయకులు పరశురాములు, కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, గన్నారపు కమల్, దీపు, అయేషా ఫాతిమా, విద్య, నాగరాజు, సుకుమార్, దేవి, వాసు, వివేక్, నిరంజన్, రమేష్, తాళ్లపల్లి రమేష్, వాడుక నాగరాజ్, రాచర్ల రాము, గట్టు చందు, రుద్ర శ్రీనివాస్, పూజారి కుమారస్వామి, మాము నూరి రాజు, మాల్వ రాజు, ఇజ్జగిరి భీమరాజ్, ములుగు నక్క జ్యోతి, ప్రశాంత్, మంద చంటి, మైదాన్ కరుణాకర్, గొర్రె అరుణ్, మిద్దపాక ఆనంద్, రితిక రాజ్ కుమార్, బీస్ పాక వరుణ్, బిసిపాక శివ, మాదాసు ఎలీషా, రామకృష్ణ, కృష్ణవేణి కొడకండ్ల సరిత, తహసీన్, వర్షం వనిత,రమ్య,అడుప విజయ్, స్వప్న, స్వాతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సీస్ పరీక్ష కేంద్రం సందర్శన



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని హైస్కూల్ లింగాపురం, ప్రాథమిక పాఠశాల కొనాపురం పాఠశాలలను జిల్లావిద్యాశాఖాధికారి డి.వాసంతి ఆకస్మికంగా సందర్శించారు. శుక్రవారం జిల్లాలోని ఎంపిక చేయబడిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలోని 3వ, 6వ, 9వ తరగతి విద్యార్థులకు సీస్ పరీక్ష ఎస్ ఈ సీపీ స్టేట్ ఎడ్యుకేషన్ ఆచీవ్ మెంట్ సర్వే పరీక్ష నిర్వహించారు. లింగాపురం, కొనాపురం పాఠశాలలలోని సీస్ పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించి ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, పరీక్ష జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఈ పాఠశాలలోని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారుట. జిల్లావిద్యాశాఖాధికారి విద్యార్థులకు గణితం, ఆంగ్లం,తెలుగు సబ్జెక్ట్ లపై విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్ లపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వివరించారు. అలాగే డీఈఓ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం వడ్డించాలని తెలిపారు. హైస్కూల్ చెన్నారావుపేటలోని సీస్ కేంద్రాన్ని జిల్లా పరిశీలకులు సీహెచ్ నాగార్జన రావు, సీహెచ్ శ్రీనివాస్ రావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ బైరి సరళ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మానుపాటి పాపమ్మ, బోయినపల్లి ప్రభాకర్ రావు, ప్రధానోపాధ్యాయులు సలీమ్, కిషోర్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్ సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## చల్లా వెంటే పరకాల ముస్లింలు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ముస్లిం మైనారిటీల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది, వారంతా బీఆర్ఎస్ వెంటే ఉంటారని పరకాల మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ముఫీనా ఫాతిమా హమీద్ అన్నారు. గత పాలకులు ముస్లిం మైనారిటీలను ఓటర్లుగా మాత్రమే చూసే వారని, సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత మైనారిటీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ముస్లిం ఆడ బిడ్డల వివాహానికి షాదీ ముబారక్ పథకం ద్వారా రూ,1,00,116 అందిస్తున్నారని తెలిపారు. మజీద్ మౌజన్, ఇమామ్ లకు ప్రతి నెల రూ.5000 గౌరవ వేతనం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. రంజాన్ మాసంలో నిరుపేద ముస్లింలకు బట్టలు, రంజాన్ విందును ఏర్పాటు చేస్తుందన్నారు. పేద ముస్లిం విద్యార్థులకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి పైన ఒక లక్ష 25వేలు ఖర్చు చేస్తుందని తెలిపారు. చిరు వ్యాపారాలు చేసే పేద ముస్లిం కుటుంబాల కోసం 100 శాతం సబ్సిడీతో ఒక లక్ష రూపాయల రుణం అందచేస్తున్నారని, అలాగే పేద మహిళల కొరకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా కుట్టు మిషన్లు అందిస్తున్నారని అన్నారు. ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గ ముస్లిం మైనారిటీలు చల్లా ధర్మారెడ్డికి తమ మద్దతు తెలిపి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ రావాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని కామారం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువ నాయకులు ఆ పార్టీలకు రాజీనామా చేస్తూ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తు అంతా బీఆర్ఎస్ పార్టీతోనే ఉందన్నారు. తెలంగాణ రాకపోతే అభివృద్ధి జరిగేదా ఆలోచించండని అన్నారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్ చేతులను బలోపేతం చేయండని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో శానబోయిన రాజు, రాకేష్, చంటి, మాదాసి వినయ్, ఎలగొండ చందు, పెరుమాండ్ల వంశీ, ఎలగొండ పరమేష్, పెరుమాండ్ల రితీష్ వర్మ, తెట్టే కరుణాకర్, ఎం.రాజిరెడ్డి, కాసర్ల అఖిల్ లతో తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది కిషన్ రెడ్డి, తోట కుమారస్వామి, తోట చంద్రశేఖర్, మాదిరెడ్డి ప్రతాప్ రెడ్డి తదితులు పాల్గొన్నారు.

## 5న చెవ్వాల జ్యోతి సంతాప సభ



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** బహుజన ఉద్యమకారులు, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు చెవ్వాల జ్యోతి సంతాప సభను ధర్మారంలోని వారి గృహంలో ఈనెల 5 ఆదివారం ఉదయం 11 గంటలకు భీమదేవరపల్లి మండల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జేఏసీ గొడుగు కింద పని చేసిన సహచర ఉద్యమకారులు పార్టీలకతీతంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాలు, దళిత సంఘాలు, కళాకారులు, ప్రజా సంఘాలు జ్యోతి కుటుంబానికి ఆర్థికంగా సహకరించిన దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులందరూ హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి టీజేఏసీ అప్పటి రాష్ట్ర చైర్మన్ ఆచార్య కోదండరాం హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరవుతున్నారు. ఈ సమావేశంలో చెవ్వాల ప్రకాష్, రేణిగుంట్ల భిక్షపతి, మాట్ల వెంకటస్వామి, కందె సుధాకర్, పొన్నాల వినోద్ కుమార్, ఉప్పుల కుమారస్వామి, మాదుగుల స్వామి, టేకుల సంపత్ పాల్గొన్నారు.

## నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగిన చేతన ర్యాలీలో టీఎన్జీవో కేంద్ర సంఘ నాయకులతో పాటు హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య పాల్గొన్నారు. ఈ ర్యాలీలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించవలసిందిగా డిమాండ్ చేశారు. దీంతో పాటుగా ఉద్యోగుల ఆదాయపు పన్ను పరిమితిని పెంచడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు పరచాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## క్రీడా సామాగ్రి అందజేత



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో, మదిరాజ్ సాయి రతన్ (సన్నీ అన్న యువసేన ), సామాజిక సేవా దృక్పధ ఫిలాంతర జన్మదిన వేడుకలను నిర్వహించారు. వారు విద్యార్థినిలకు వివిధ రకాల క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీఎస్ హెచ్ఓ మెట్టుపల్లి జ్యోతి , ప్రెసిడెంట్ మదూరి అఖిల్ గౌడ్, కత్తి స్వామి గౌడ్, జాటోతు యాకుబ్, ప్రణీత్ రాజేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు శుభవార్త. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 27న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ హనుమకొండ నుంచి ఏర్పాటు చేయడం జరిగిందని టీఎస్ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. సర్వీసు నంబర్ 92222గల సూపర్ లగ్జరీ బస్సు నవంబర్ 25న రాత్రి 8 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి నవంబర్ 26 ఉదయం ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనం, మధ్యాహ్నం వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం, అనంతరం రాత్రి అరుణాచలం చేరుకుంటుంది. అరుణాచలేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత నవంబర్ 27న అరుణాచలం నుంచి మధ్యాహ్నం బయలుదేరి 28 ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి వెళ్తుంది. అక్కడ దర్శనానంతరం హనుమకొండకు చేరుకుంటుంది. అరుణాచల గిరి ప్రదర్శన కోసం ఏర్పాటు చేసిన ఈ బస్సులో టికెట్టు ధరను ఒక్కొక్కరికి రూ.4500గా సంస్థ నిర్ణయించింది. ఈ బస్సులో ప్రయాణం కోసం సంస్థ అధికారిక వెబ్ సైట్ tsrtconline.inలో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. వరంగల్, హనుమకొండ, కాజీపేట, చుట్టుపక్కల ప్రాంతాల వారు తమ దగ్గరలోని బస్టాండ్ తో పాటు సమీప టీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోనూ బుక్ చేసుకోవచ్చు. ఈ సర్వీస్‌కు ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం 9959226047, 7382855492 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని టీఎస్ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత పేర్కొన్నారు.

## వొడితల ప్రణవ్ గెలవాలని ప్రార్థనలు



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు వచ్చే అసెంబ్లీ ఎన్నిక లలో హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలవాలని అత్యధిక మెజార్టీతో గెలిపొందాలని హుజూరాబాద్ ముస్లింలందరి తరఫున బీజిగిరి షరీఫ్ ఈద్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎం డీ తౌసీఫ్, అలీం, రఫీ, నవాబ్, సలీం, జియా, సల్మాన్, హది, అన్వార్, రియాజ్, సాదిక్, ముశీద్, సిరాజ్ పాల్గొన్నారు.

# అడవి బిడ్డ నాగజ్యోతికి అండగా నిలవాలి



ములుగులో బీఆర్ఎస్‌దే విజయం

రైతు బంధు, రైతు బీమాకు అంతర్జాతీయంగా ప్రశంసలు

కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



**జన హృదయనేత.. ప్రగతి ప్రదాత.. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం నిర్విరామ కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేసిన ఆయన పార్టీలో అన్ని శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పి కొడుతూ తనదైన రీతిలో దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారం చేపట్టేలా, ములుగులో నాగజ్యోతి భారీ మెజారిటీతో గెలిచేలా ఆయన వ్యూహాలు రచిస్తున్నారు.**











కాంగ్రెస్, బీజేపీ నుంచి ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న ముప్పును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. బడుగులకు, బలహీనులకు రక్షణ కల్పించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన బలంగా చెబుతున్నారు. అభివృద్ధి, సంక్షేమం, శాంతి భద్రతల కోసం కారు గుర్తును ఆదరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈనెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ ఎస్ కు పట్టం కట్టాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆయన 'వరంగల్ వాయిస్ ప్రతినిధి'తో మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి, ప్రజల సాధికారత, బడుగు బలహీన వర్గాలకు రక్షణ కల్పించే పార్టీ బీఆర్ఎస్ అన్నారు. అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనే నిదర్శనమని పేర్కొన్నారు.

### కేసీఆర్ లాంటి నాయకుడిని వదులుకోవద్దు..

దళిత సమాజం కోసం మంచి చేసే, దళితుల వికాసాన్ని మనస్ఫూర్తిగా కోరుకునే సీఎం కేసీఆర్ లాంటి నాయకుడిని వదులుకోవద్దని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి ధైర్యం చేసి దళిత బంధు అమలు చేస్తున్నారని, ఇట్లాంటి మేలు ఎవరూ చేయలేదని చెప్పారు. రైతుల గురించి కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఆలోచించలేదని, తమ ప్రభుత్వం మాత్రం క్రమం తప్పకుండా రైతుబంధు ఇస్తుందని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రపంచంలోనే బెస్ట్ అని అంతర్జాతీయ సంస్థలు ప్రశంసిస్తే.. రైతుబంధును 'బిచ్చం' అని కాంగ్రెస్ అంటోందని విమర్శించారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు కింద 11 విడతల్లో రూ.72, 815 కోట్లు వేసిన ప్రభుత్వం తమదేనని తెలిపారు. రైతు బీమా పథకం కింద కోట్లాది రూపాయల పరిహారం అందజేశామన్నారు. ఏటా రూ.10వేల కోట్లకు పైగా భరిస్తూ రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని ఎమ్మెల్సీ తెలిపారు. ఇలాంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవని ఆయన పేర్కొన్నారు.


### ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు..

ధరణి పోర్టల్ తెచ్చిన తర్వాత ప్రజల భూముల మీద అధికారుల పెత్తనం పోయిందని, కాంగ్రెస్ కు ఓటేస్తే పైరవీకారుల రాజ్యం వస్తదని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేసిందని, తమ పార్టీ పట్ల ప్రజలు మరింత ఆకర్షితులవుతున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు డబ్బులు ఎర చూపి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని, ప్రజలే సరైన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. తెలంగాణ వచ్చాకే మారుమూల ప్రాంతాలు అభివృద్ధి చెందాయని ఆయన గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని పోచంపల్లి తెలిపారు.

### నాగజ్యోతికి ఒక్క ఛాన్స్ ఇవ్వండి..

ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఆమెకు ఒక్క ఛాన్స్ ఇస్తే అటవీ ప్రాంతమైన ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. జడ్పీ చైర్ పర్సన్ గా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ములుగు ప్రాంతాన్ని ఆమె ప్రగతి పథంలో నిలిపారన్నారు. తమపార్టీ అభ్యర్థి నాగజ్యోతి 50వేల మెజార్టీతో గెలుస్తుందని, ప్రజల కోసం నిత్యం పోరాడే ఆమెకు నియోజకవర్గంలో తిరుగు లేదన్నారు. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని, ఆమెను గెలిపించి ప్రజలు సత్తా చాటాలని ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి కోరారు. ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాగజ్యోతికి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈసారి ఎన్నికల్లో విచక్షణతో ఓటు వేయాలని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.







శుక్రవారం 03, నవంబర్ 2023
www.warangalvoice.net

## రోడ్డు ప్రమాదంలో మెకానిక్ మృతి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రానికి చెందిన బూర వెంకటరమణ (42) అనే మెకానిక్ శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెకానిక్ వెంకటరమణ బైక్ పై వెళ్తుండగా కానీపర్తి నుంచి కమలాపూర్ కు వస్తున్న లారీ ఢీకొట్టింది. డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా లారీని నడుపుతూ బైకును ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదంలో మెకానిక్ తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మెకానిక్ రోడ్డు ప్రమాదంలో చనిపోగా మెకానికుల సంఘం ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటరమణ మృతి కుటుంబానికి తీరని లోటు అని, ప్రజా ప్రతినిధులు, లీడర్లు మెకానిక్ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచి ఆదుకోవాలని కోరారు.

## ఎర్రబెల్లి ప్రదీప్ రావు సతీమణి ప్రచారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 36వ డివిజన్ లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి భారతీయ జనతా పార్టీ బలపరిచిన బీజేపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావుకు ఓటు వేయాలని ఆయన సతీమణి ఎర్రబెల్లి రేణుక ప్రదీప్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి భారతీయ జనతా పార్టీ చేస్తున్న అభివృద్ధిని వివరించి, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు భరోసా కల్పించి, ఈసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాగానే తమ సమస్యలను పరిష్కరిస్తామనీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి రేణుక ప్రదీప్ రావుతో పాటు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

### తొలిరోజు పలువురి నామినేషన్లు





**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 10 వరకు నామపత్రాలు స్వీకరిస్తారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. తొలిరోజు వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అదే విధంగా వరంగల్ తూర్పులో బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్ రావు నామినేషన్ వేశారు. బీఆర్ ఎస్ అభ్యర్థిగా, ఇండిపెండెంట్ గా రాజనాల శ్రీహరి వేర్వేరుగా నామినేషన్లు వేశారు. నర్సంపేట నియోజకవర్గంలో ఎంసీపీఐ ఆధ్వర్యంలో పెద్దారపు రమేష్, ఇండిపెండెంట్ గా ఇమ్మడి చిన్ని క్రిష్ణ నామినేషన్ వేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆర్డీవో కార్యాలయంలో బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తి రెడ్డి నామినేషన్ వేశారు. వరంగల్ తూర్పు రిటర్నింగ్ అధికారిగా షేక్ రిజవాన్ బాషా, వర్ధన్నపేట రిటర్నింగ్ అధికారిగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నర్సంపేట రిటర్నింగ్ అధికారిగా ఆర్డీఓ కృష్ణవేణి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు.

## ఓటు హక్కును యువత వినియోగించుకోవాలి

### హనుమకొండ అదనపు ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓటు హక్కు యువత చేతిలో వజ్రాయుధం లాంటిదని హనుమకొండ అదనపు ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల అన్నారు. శుక్రవారం కేడీసీలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. దేశ అభివృద్ధి పథంలో కీలక భూమిక పోసించే యువత ఉత్సాహంతో ఓటింగ్ లో పాల్గొనాలన్నారు. సభా అధ్యక్షత వహించిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార అధికారి శ్రీధర్ సురునెని మాట్లాడుతూ తమ విభాగం ద్వారా ఓటు హక్కు పై చైతన్య కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థి, యువత ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజి రెడ్డి, హన్మకొండ స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, సమాచార ప్రసార సంబంధాల శాఖ ఏడీ లక్ష్మణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ గేయ నాటక విభాగం వారిచే ఈ సందర్భంగా ఇంద్రజాల, కళా ప్రదర్శన నిర్వహించారు.

# ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం

### వంద శాతం ఓటింగ్ పై ప్రత్యేక శ్రద్ధ

### కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అర్బన్ లో నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ద వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీతో కలసి శాసన సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీప్ ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓటర్లను చైతన్యం చేస్తున్నారని అన్నారు. నవంబరు 30న పోలింగ్ ఉండటంతో ఆ రోజు ఓటుహక్కు ఉన్న వారంతా వినియోగించుకోవాలని ముమ్మర ప్రచారం చేయాలని సూచించారు. మరుమూల ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరుగుతుండగా అర్బన్ లో తక్కువగా నమోదవడం ఆందోళన కల్గించే విషయం అన్నారు. ఓటేసేందుకు ఆసక్తి చూపడానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డిగ్రీ కళాశాలల్లో అధికారులు యువతకు అవగాహన కల్పించాలి తెలిపారు. ఓటింగ్ పెంచేందుకు మిషన్ 29కింద అర్బన్ లో 23 డివిజన్లలో 23మంది అధికారులను నియమించామని పేర్కొన్నారు. బస్టాండు, రైల్వే స్టేషన్లతో పాటు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికి సిబ్బంది వెళ్తూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వివరిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీ లో నివసించే వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధంలాంటిదని..దానిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకోనే విధంగా ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, నోడల్ అధికారి హరిప్రసాద్, మెప్మా డైరెక్టర్ భద్రు నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ నిర్మల, డీటీడబ్ల్యూఓ ప్రేమకళా, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, డీపీఓ జగదీష్, డీఎంహెచ్ ఓ సాంబశివ రావు, రమేష్ తదితరులు ఓట్ ఫర్ ష్యూర్ అనే కరపత్రాన్ని విడుదల చేశారు.

## బీజేపీకి భారీ షాక్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఎన్నికలవేళ వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీకి భారీ షాక్ తగిలింది. 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమళ్ళ అరుణ సుధాకర్ ఆధ్వర్యంలో 37 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు బీజేపీలో వివిధ పదవుల్లో కొనసాగి ప్రస్తుతం బీజేపీ 33వ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న చిలువేరు రాజేందర్ తోపాటు దుస్స శివ, తాటిపాముల భిక్షపతి, రాజు, అనిల్ మరో 50 కుటుంబాలు శుక్రవారం బీజేపీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తో పాటు వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు, కుడా డైరెక్టర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులకు బాలుడి అప్పగింత



**వరంగల్ వాయిస్, క్రైం :** ఎనిమిది నెలల క్రితం ఇంటి నుండి పారిపోయిన బాలుడిని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు చెందిన యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ విభాగం పోలీసులు శుక్రవారం తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన సంబందించి వరంగల్ డీసీపీ బోనాల కిషన్ వివరాలను వెల్లడిస్తూ.. అంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన తొమ్మిది సంవత్సరాల బాలుడు తండ్రి మరణించడంతో తల్లి వేరొకరిని వివాహం చేసుకోవడంతో నానమ్మ వద్ద వుంటూ గత మార్చి నెలలో ఇంటి నుంచి పారిపోయి రైలులో వరంగల్ కు చేరుకున్నారు. బాలుడిని రైల్వే పోలీసులు చైల్డ్ లైన్ వసతి గృహానికి తరలించారు. అక్కడి నుండి బాలుడు తప్పించు కొని పోవడంతో కేసు నమోదు చేసుకున్న ఇంతేజార్ గంజ్ పోలీసులు విజయవాడలో బిక్షాటన చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని వరంగల్ తీసుకొచ్చి వరంగల్ ఏసీపీ సమక్షంలో అతని నానమ్మకు అప్పగించారు.

# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

### ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

### కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ కంట్రోల్ రూమ్ ను ఆకస్మికంగా సందర్శించి 24గంటలు పని చేసే ఫిర్యాదుల కేంద్రం, విజిల్, కంట్రోల్ రూం, 1950, సోషల్ మీడియా ఫిర్యాదుల నమోదును పరిశీలించి మరింత సమర్థంగా నిర్వహించుటకు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిస్పక్షపాతంగా స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో జరగడంలో జిల్లా ఫిర్యాదుల కేంద్రం కీలక పాత్ర వహిస్తుందన్నారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. యువత సీ-విజిల్ యాప్ ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలను, ఉల్లంఘనలను తమ దృష్టికి తీసుకుని రావాలని, 24గంటలు కలెక్టరేట్ కార్యాలయంలోని సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుంచి సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని అన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహిణ, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్ ఫొటోలు, వీడియోలు సీ-విజిల్ యాప్ ద్వారా పంపాలని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 38కేసులు నమోదు కాగా అన్ని పరిష్కరించామని అన్నారు. ఓటర్ వివరాల కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్ కాల్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్విలెన్స్ టీం, వెబ్ కెమెరా, మౌంటెడ్ కెమెరాల ద్వారా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియామావళి పర్యవేక్షణ వివరాలను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని 3నియోజకవర్గాలలోని మూడు వాహనాలు షిఫ్ట్ ల వారీగా నిత్యం పర్యవేక్షిస్తాయని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసు చంద్ర, నోడల్ ఆఫీసర్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్ప, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, ఏవో శ్రీకాంత్ , ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్ కుమార్, కంట్రోల్ రూమ్, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com